క్లుప్తంగా

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

కార్పొరేషన్ కమిషనర్ భావన



మాట్లాడుతున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. గడచిన 15 రోజుల్లో వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులు ఎన్ని? పరిష్కరించిన దరఖాస్తులు ఎన్ని? ఇంకా పరిష్కారం కావాల్సినవి ఎన్ని? పెండింగ్‌లో ఉండడానికి కారణాలు ఏమిటి? వంటి అంశాలపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అయోధ్యకు సైకిల్ యాత్ర



అయోధ్య సైకిల్ యాత్రలో పాల్గొన్న ఇంద్రపాలెం భక్తులు

కాకినాడ రూరల్: సమాజహితం, గ్రామస్తుల సుఖ సంతోషాలు కోరుతూ మండలంలోని ఇంద్రపాలెం గ్రామస్తులు అయోధ్య రాములవారి దర్శనానికి సైకిల్ యాత్ర చేపట్టారు. గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు వాసంశెట్టి వీరభద్రరావు, విత్తనాల హరిచంద్రరావు, కాళ్ల శ్రీనివాస్, దారపు బాలాజీ బృందం అయోధ్య రాములోరిని చూసేందుకు ఇటీవల సైకిల్‌యాత్రగా పయనమయ్యారు. ప్రస్తుతం ఈ బృందం అయోధ్యకు 700 కిలోమీటర్ల దూరంలో మధ్యప్రదేశ్ పొలి గ్రామం చేరుకుంది. యాత్ర విజయవంతంగా జరుగుతున్నట్టు వీరభద్రరావు శుక్రవారం తెలిపారు.

రైఫిల్ షూటింగ్, జిమ్నాస్టిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ



పతకాలతో క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య, జిమ్నాస్టిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రైఫిల్ షూటింగ్, జిమ్నాస్టిక్స్ పోటీల్లో నగరానికి చెందిన విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించిన రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఎన్వీ శ్రీకాంత్ అండర్-19 టీం ఈవెంట్‌లో బంగారు పతకం సాధించాడు. వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం అందుకున్నాడు. వ్యక్తిగత విభాగంలో జి.చంద్రహాస్ రజత పతకం పొందాడు. భోపాల్‌లో డిసెంబర్‌లో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధించారు. వీరు స్థానిక ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నారు. శుక్రవారం పాఠశాలలో వీరిని అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా, పది మందికి రెండు రోజుల చొప్పున జైలు, 18 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అధిక ఒత్తిడితో మధుమేహం

కాకినాడ రూరల్: ఆధునిక జీవనశైలిలో అధిక ఒత్తిడి కారణంగా మధుమేహం రావచ్చని లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్ అధ్యక్షుడు బి.రవికుమార్ అన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లో క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ రక్త పరీక్షలు నిర్వహించారు.

సినిమాలు

ఆనంద్ సినిమాస్	:	వెనమ్, విశ్వం, వేట్టయాన్ లగ్గం
దేవి మల్టీప్లెక్స్	:	వెనమ్, లగ్గం, గ్యాంగ్‌స్టర్, విశ్వం
లక్ష్మీ	:	పొట్టేల్
సత్యగౌరి	:	వెనమ్
తిరుమల	:	వేట్టయాన్ ది హంటర్
సీఅండ్‌సీ	:	నరుడి బ్రతుకు నటన
సీఅండ్‌సీ 2	:	శ్వాగ్
పద్మప్రియ	:	దేవర
శ్రీప్రియ	:	మార్టిన్
సూర్య 1	:	వెనమ్
సూర్య 2	:	దేవర

డబ్బు అందింది.. థాంక్యూ బాస్..

- పెరిగిన వర్తక, వినియోగదార్ల డిజిటల్ లావాదేవీలు
- కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో 35 వేల మంది చిరు వ్యాపారులు
- పేమెంట్లకు పెరుగుతున్న ఆదరణ



బజ్జీల దుకాణంలో ఏర్పాటు చేసిన పేమెంట్ క్యూఆర్ కోడ్



నగరంలోని ఓ పాప్‌కార్న్ బండిలో..

కాకినాడ సిటీ: గతంలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందు జేబులో డబ్బు పెట్టుకుని వచ్చేవారు. ఇప్పుడు కాలం మారింది. టీ తాగాలన్నా, మార్కెట్‌లో కూరగాయలు, సరకులు కొనుగోలు చేయాలన్నా, మోటార్ సైకిల్‌లో పెట్రోల్, ఆటోలో డీజిల్ పోయించాలన్నా, ఇతర ఏ వస్తువులు కొనాలన్నా చేతిలో నగదు ఉండాల్సిన అవసరం లేదు. జేబులో ఓ స్మార్ట్ ఫోన్, ఖాతాలో డబ్బు ఉంటే చాలు. ప్రతి లావాదేవీని సులభంగా చేయవచ్చు. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాల చెంతకు వచ్చేశాయి. పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే, క్యూ ఆర్ కోడ్ స్కానర్ లేకుండా ఏ వ్యాపారీ కనిపించడం లేదంటే అతిశయోక్తి కాదు.

రెండు నియోజకవర్గాల్లో..

ప్రస్తుతం స్కానర్లు చిరు వ్యాపారులకు సైతం అందుబాటులోకి వచ్చాయి. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో, థర్డ్ పార్టీ నిర్వాహకులు అన్ని దుకాణాల వద్దకు వెళ్లి పేమెంట్ స్కానర్లు, స్పీకర్లతో పెడుతున్నారు. కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో మొత్తం చిల్లర దుకాణాలు, టీ దుకాణాలు, తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు, కూరగాయల వ్యాపారులు, బుక్‌స్టాల్స్, జెరాక్స్ షాపులు వంటివి దాదాపు 35 వేలకు పైనే ఉన్నాయి. వీటిలో రోజూ రూ.3 వేల నుంచి రూ.ఒక లక్ష వరకు లావాదేవీలు జరుగుతుంటాయి. వీటితో దాదాపు 50 శాతం వరకు లావాదేవీలు డిజిటల్ చెల్లింపుల ద్వారా జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్కానర్ ద్వారా చెల్లింపు సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. స్పీకర్ బాక్సు పెడితే కంపెనీలను బట్టి మినిమం చార్జీలు ఉంటాయి. స్పీకర్ బాక్స్ పెడితే నెలకు రూ.120 వరకు చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. మొత్తం 300 లావాదేవీలు లోపలైతే వ్యాపారి రూ 90 కట్టాల్సి వస్తుంది.

కోవిడ్‌తో మార్పులు

దేశంలో 2016లో పెద్ద కరెన్సీ నోట్లను రద్దు చేశారు. అనంతరం ఆర్థిక లావాదేవీల పేమెంట్లను ప్రోత్సహించారు. అది పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైంది. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్తుందనే అపోహ, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో స్మార్ట్ చెల్లింపులు గ్రామీణ ప్రాంతాలకు చేరలేదు. 2019 కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. చెల్లింపుల్లోనూ మార్పులు వచ్చాయి. పేమెంట్ యాప్‌లతో అన్ని చోట్లా డిజిటల్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు, మొబైల్, డీటీహెచ్, విద్యుత్, వంటగ్యాస్ బిల్లులు, ఫుడ్ డెలివరీ, ఆర్టీసీ బస్సుల్లో సైతం, ఇతర ఆర్థిక లావాదేవీల వరకు ఈ యాప్‌ల నుంచి చెల్లింపులు జరుగుతున్నాయి. బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.

చిరు వ్యాపారుల చెంతకు..

టీ స్టాళ్లు, రోడ్ల పక్కన హోటళ్లు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారాలు చేసే వారంతా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నారు. దీంతో చిల్లర సమస్య ఉండడం లేదు. పేమెంట్ యాప్‌లకు క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా స్కానర్ స్టిక్కర్ బోర్డులు కనిపిస్తున్నాయి.

స్పీకర్‌లో చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు, అదమరిస్తే మోసానికి గురయ్యే అవకాశం ఉంది. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరకులను కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి అమౌంట్ బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ మెసెజ్‌లు దుకాణదారునికి అమౌంట్ పే చేసినట్లు చూపించి, అక్కడ నుంచి జారుకుంటారు. మార్కెట్‌ల్లోకి వచ్చిన క్యూ ఆర్ కోడ్ స్పీకర్ బాక్స్‌లు ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే, ఎంత మొత్తం దుకాణదారు ఖాతాకు జమ అయ్యిందనే విషయం స్పీకర్‌తో బయటకు వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

కరెన్సీ సమస్య లేదు



గతంలో ఏది కొనుగోలు చేయాలన్నా తప్పనిసరిగా నగదు ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం చేతిలో రూపాయి లేకపోయినా దర్జాగా మనకు కావాల్సినవి కొనుగోలు చేసుకోవచ్చు. దొంగనోట్ల సమస్య లేదు. నగదు జేబులో పెట్టుకుంటే.. పోతుందనే భయం ఉండేది. డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి వచ్చాక ఆ సమస్య లేకుండా పోయింది.

– మట్టపర్తి రఘురామ్, సంజయ్‌నగర్, కాకినాడ

చిల్లర ఇబ్బంది ఉండదు



నేరుగా జరిపే నగదు లావాదేవీల కన్నా డిజిటల్ విధానమే బాగుంది. చిల్లర సమస్య లేదు. మోసాలకు తావు లేదు. రానున్న రోజుల్లో పూర్తిగా నగదు రహిత లావాదేవీలే జరుగుతాయి. ఈ విధానం వల్ల పని కూడా తొందరగా అవుతుంది. రోజుకు రూ.6 వేల వరకు డిజిటల్ లావాదేవీలు జరుగుతుండగా, నగదు లావాదేవీలు రూ.వెయ్యి వరకు మాత్రమే జరుగుతున్నాయి.

– కరుణ, పండ్ల వ్యాపారి, కాకినాడ

భూ సమస్యలపై దరఖాస్తు చేయాలి



కూరాడ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

కరప: భూ విస్తీర్ణంలో తేడాలు, రైతులకిచ్చిన రికార్డుల్లో తప్పులు, ఇతర భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ అన్నారు. కూరాడలో శుక్రవారం జరిగిన రీ సర్వే గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్య ఉన్నా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దస్తావేజు ప్రకారం పాస్ పుస్తకంలో భూ విస్తీర్ణం నమోదు కాకపోయినా, పేర్లు తప్పుగా నమోదైనా రీసర్వేలో రైతులు వాటిని సరిచేయించు కోవచ్చన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 226 దరఖాస్తులు వచ్చినట్టు వీఆర్వో టేకుమూడి శ్రీనివాసరావు తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, ఆర్‌ఐ పవన్‌కుమార్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, వీఎస్ జి.అర్జున్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వెలుగుబంట్ల సూరిబాబు, మాజీ ఎంపీటీసీ పితాని జయరామ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగితేనే.. కాయగూరల విక్రయం

- రైతు బజార్ వద్ద రైతుల ధర్నా
- కూటమి నేతల జోక్యం ఎక్కువైందంటూ విమర్శలు



ఎస్టేట్ అధికారి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

బోట్‌క్లబ్: ఎన్నో ఏళ్లుగా కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నున్న రైతు బజార్‌లో 90 మంది తాము పండించిన కూరగాయలను విక్రయిస్తున్నారని, ప్రస్తుతం కూటమి నాయకుల పెత్తనం ఎక్కువైందని, తమకు రక్షణ కల్పించాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. రైతు బజార్‌ను రాజకీయ కేంద్రంగా చేయవద్దని వారు కోరారు. నిబంధనల మేరకు ప్రతి వారం డ్రా తీసి, కూరగాయలు విక్రయించే షాపులు కేటాయించాలని చెప్పారు. ఇంగ్లిష్ కూరగాయలు (క్యారెట్, క్యాప్సికం వగైరా) విక్రయించే వారికి మినహాయింపు తగదన్నారు. అలా చేస్తే తాము కూరగాయలు విక్రయించబోమని శుక్రవారం రైతు బజార్ ఎస్టేట్ అధికారి కార్యాలయం వద్ద రైతుల ధర్నా నిర్వహించారు. తమకు అధికారులు న్యాయం చేసేంత వరకు కూరగాయలు విక్రయించబోమంటూ షాపులు మూసివేశారు. పలువురు రైతులు తమ వద్దనున్న కూరగాయలు ధర్నా చేస్తున్న ప్రదేశం వద్ద కుప్పలుగా పోసి, వినియోగదారులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్నర్ షాపులు కొంతమందికి కేటాయించడం తగదని, వాటిని కూడా డ్రా తీయాలంటూ రైతులు పట్టుబట్టారు. ఇటీవల జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఇక్కడి షాపులు పరిశీలించేందుకు వచ్చారని, అప్పుడు ఇదే విషయం చెప్పామని వివరించారు. అయినప్పటికీ ఆ షాపులకు ప్రతి వారం మినహాయింపు ఇచ్చి, తమకు అన్యాయం చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరూ, నాయకుడు చింతలపూడి రవి సైతం 8 షాపులకు మినహాయింపు ఇస్తామని చెప్పడంతో.. అలా కుదరదని, అందరి షాపులకు డ్రా తీయాల్సిందేనని రైతులు పట్టుపట్టారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని, కూరగాయలు యథావిధిగా విక్రయించుకోవాలని రైతు బజార్ ఎస్టేట్ అధికారులు ఎంత నచ్చజెప్పినా.. రైతులు కుదరదని తెగేసి చెప్పారు. రైతుబజార్‌కు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు తమకు కావాల్సిన కూరగాయలు ఇక్కడ విక్రయించకపోవడంతో, వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి వరకు కూరగాయలు విక్రయించకుండా రైతులు ధర్నా చేశారు. తాము ఎన్నో ఏళ్లుగా కలసికట్టుగా ఇక్కడ వ్యాపారం చేస్తున్నామని, ప్రస్తుతం కూటమి నాయకులు తరచూ రైతు బజార్ విషయంలో జోక్యం చేసుకోవడం తగదని రైతులు రాచకొండ గంగాధర్, కర్ని శ్రీను తెలిపారు. రైతులందరికీ సమ న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు . వారికి షాపులు ఇవ్వకుంటే రౌడీలుతో కొట్టిస్తామని బెదిరిస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

మూసివేయడం కుదరదు

రైతు బజార్ మూసివేయడం కుదరదని, రైతులు ఇక్కడ కూరగాయలు విక్రయించకుంటే ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించాలని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఏడీ నాగేశ్వరరావు ఎస్టేట్ అధికారులు గోవిందరాజు, కృష్ణారావుకు ఆదేశించారు. ఆయన రైతు బజార్ వద్ద రైతులతో మాట్లాడారు. రైతులు తమకు న్యాయం జరిగే వరకూ కూరగాయలు విక్రయించబోమంటూ భీష్మించడంతో.. శనివారం నుంచి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాట్లు చేయాలని ఆయనన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించండి

మెప్మా పీడీ ప్రియంవద



డ్వాక్రా ఉత్పత్తులను పరిశీలిస్తున్న పీడీ ప్రియంవద

కాకినాడ: ప్రతి ఒక్కరూ డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.ప్రియంవద కోరారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను స్థానిక రిజర్వు పోలీసు లైన్ సమీపంలో శుక్రవారం ఆమె ప్రారంభించారు. వివిధ డ్వాక్రా సంఘాల సభ్యులు సొంతంగా తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తక్కువ ధరకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్న డ్వాక్రా ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని సూచించారు. రెండు రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, పీవోలు, ఆర్పీలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరం గ్రామానికి చెందిన వీరవిల్లి శివకుమార్ శుక్రవారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన అతడు చీమల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా, అపస్మారక స్థితిలో ఉన్న అతడిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు జీజీహెచ్‌లో చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబును వివరణ కోరగా, అప్పు తీర్చే పరిస్థితి లేక ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్టు బాధితుడు స్టేట్‌మెంట్ ఇచ్చాడని తెలిపారు.

బైక్ చోరీ కేసులో ముగ్గురికి జైలు

కాకినాడ లీగల్: బైక్ చోరీ కేసులో ముగ్గురికి ఏడాది వంతున జైలు, ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.సాహితి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, కాకినాడ చెందిన దమ్ము శివ ప్రసాద్, ములపర్తి కిషోర్, గుండారపు శివరామ్‌సాయి కలిసి గతేడాది మే ఐదున కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బైకును చోరీ చేశారు. బైక్ యజమాని గున్నాబతుల భవానీశంకర్ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులకు న్యాయమూర్తి శిక్ష విధించారు. ఏపీపీ పి.రఘువీర్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

28న జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉదయం 9 గంటలకు సంస్థ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పీడీ కె లచ్చారావు శుక్రవారం తెలిపారు. భవి క్రియేషన్స్ సంస్థలో సేల్స్ మీడియా మేనేజర్లు, ఎస్ఈఓ వీడియో ఎడిటర్, గ్రాఫిక్ డిజైనర్, టెలికాలర్స్, మార్కెటింగ్ మేనేజర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, వెబ్ డవలపర్, కంటెంట్ రైటర్, ఆఫీస్ బాయ్, రిప్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, కెమిస్ట్, హోండాయ్ మోబీస్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్, పానాసోనిక్, ఇసుజు మోటార్స్, ఇండో ఎంఐఎం కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులై, 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు.

క్లాప్ వాహన డ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న క్లాప్ వాహన డ్రైవర్లు

కాకినాడ: బకాయి వేతనాలు చెల్లించి, పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్ వాహన డ్రైవర్లు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కన్వీనర్ ఎంవీ రమణ మాట్లాడుతూ, సుమారు 105 క్లాప్ వాహనాలపై 120 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి తడి-పొడి చెత్త సేకరిస్తూ, డంపింగ్ యార్డుకు చెత్త తరలిస్తున్న వీరికి మూడు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును మినహాయిస్తూ, దానిని జమ చేయడం లేదని ఆరోపించారు. ఆయా సమస్యలను నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వేతనాలు ఇవ్వకపోతే తమ జీవితాలు ఎలా గడుస్తాయంటూ నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాప్ వాహన డ్రైవర్ల సంక్షేమ సంఘ ప్రతినిధులు సంతోష్, ఇస్మాయిల్, శివశంకర్, దుర్గాప్రసాద్, రాము, భైరవస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతి

కాకినాడ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర కమిటీ కో-కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్త మున్సిపల్ సమ్మె సందర్భంగా సమ్మె కాలానికి జీతం, సంక్రాంతి బోనస్‌గా రూ.వెయ్యి చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ కాకినాడలో అమలు కాలేదన్నారు. ఆదివారం పారిశుద్ధ్య కార్మికులకు పూర్తి సెలవు అమలు చేయాలని డిమాండ్ ఉందన్నారు. స్పెషల్ శానిటేషన్ వర్కర్స్‌కి గత 6 నెలలుగా జీతాలు అందడంలేదని, క్లాప్ వాహన డ్రైవర్స్‌కు రెండు నెలల జీతాలు నేటికీ అందలేదన్నారు. శానిటేషన్ వర్కర్లకు సేఫ్టీ సౌకర్యాలు, కారుణ్య నియామకాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



సోలార్ ద్వారా అన్నం వండుతున్న విద్యార్థులు

బాలాజీచెరువు: మూడు రోజుల పాటు వివేకానంద మధురానగర్ పాఠశాలలో నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం రెండో రోజు కొనసాగింది. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. సోలార్ ద్వారా ఆహార పదార్థాల తయారీ, వాటర్ రీసైక్లింగ్, బ్యాటరీ హెలికాప్టర్, డ్రోపవర్ ప్లాంట్, వాటర్ సైకిల్ గ్లోబల్ వార్మింగ్ వంటి వివిధ రకాల ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇంధనం, గ్యాస్ వంటి నిక్షేపాలు తగ్గినప్పుడు ప్రత్యామ్నాయ వనరులను వివరించారు. అంతరిస్తున్న జీవరాశులు, ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు.

టీబీ రోగుల సాయానికి దత్తత

- పౌష్టికాహారానికి నెలకు రూ.700 ఇవ్వవచ్చు
- కలెక్టర్ షణ్మోహన్



టీబీ ముక్తి పంచాయతీలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ: జిల్లాలో క్షయ వ్యాధిని గుర్తించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డాక్టర్ రోనంకి రమేష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లాలో టీబీ వ్యాధిగ్రస్తులపై వచ్చే సమావేశం నాటికి వివరాలు అందజేయాలని ఆదేశించారు. ఈ మేరకు వారికి సహకారం అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. టీబీ రోగులకు పౌష్టికాహారం అందించేందుకు ఎవరైనా నెలకు రూ.700 అందించేందుకు దత్తత తీసుకోవచ్చన్నారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ, 2023కు జిల్లాలో 14 టీబీ ముక్తి పంచాయతీలు ఎంపికయ్యాయన్నారు. వీటికి గాంధీ కాంస్య రంగు విగ్రహాలను, ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలల సంక్షేమానికి కృషి

సమాజంలో బాల్య వివాహాలు, బాల కార్మికులు, భిక్షాటనలోని బాలలు, వారిపై వేధింపులు, బడిబయట పిల్లలు వంటి సమస్యలపై ప్రభుత్వ శాఖలన్నీ కలసికట్టుగా పని చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశపు మందిరంలో మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి.కమలాదేవితో కలిసి మిషన్ వాత్సల్య త్రైమాసిక బాలల సంరక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్కూల్ స్థాయి నుంచి బాలల చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్లలోపు బాలబాలికల కోసం మిషన్ వాత్సల్య ద్వారా వివిధ పథకాలను అందిస్తారన్నారు. తల్లిదండ్రుల్లేని, పాక్షిక అనాథలకు స్పాన్సర్‌షిప్ పథకం కింద నెలకు రూ.4 వేలు అందిస్తారని చెప్పారు. జిల్లాలో వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా బాలల సంరక్షణ గృహాలు నిర్వహిస్తారని వివరించారు. శిశు గృహ ద్వారా పిల్లల్లేని వారికి దత్తత ఇస్తారని చెప్పారు. మానసిక వికలాంగ బాలలకు సంరక్షణ గృహాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కొండా ప్రవీణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఆర్ శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

కాకినాడ రూరల్: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక రమణయ్యపేట మూడో బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంప్‌లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. హెచ్‌ఏసీ కమాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు వీవీవీ సత్యనారాయణ, మురళీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

బాలాజీచెరువు: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో గుంటూరులో జరిగే విద్యార్థుల సమ్మేళన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. జేఎన్‌టీయూకేలో రిజిస్ట్రార్ చాంబర్‌లో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్ర పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. సంఘ కన్వీనర్ సత్యసాయి మాట్లాడుతూ, గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో రాష్ట్రంతో పాటు, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొంటారన్నారు. యూనివర్సిటీ ప్రెసిడెంట్ రాజీవ్, కార్యదర్శి సూర్య, మహిళా కన్వీనర్ విజయ పాల్గొన్నారు.

పశుగణన ప్రారంభం

కాకినాడ రూరల్: పశువుల సమాచారం సేకరించేందుకు గాను పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ శుక్రవారం ప్రారంభించారు. గుడారిగుంటలో తన నివాసం వద్ద పశు సంవర్ధక శాఖ అధికారుల సమక్షంలో ఆయన కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో పశుగణనకు శ్రీకారం చుట్టారు. ప్రజలు తమ పశువుల వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ సురేష్‌బాబు, వైద్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ వితరణ

కరప: ప్రవాసాంధ్రుడు పులి రామలింగేశ్వరరావు వితరణతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ జట్టుకు క్రీడా సామగ్రి సమకూరింది. కరప మండలం పెదకొత్తూరు గ్రామానికి చెందిన అడపా శ్రీనివాస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-16 క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఈ విషయాన్ని రాంబాబుకు తెలపగా, ఆయన స్పందించి రూ.16 వేల విలువైన క్రికెట్ కిట్‌ను సమకూర్చారు. శుక్రవారం కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్‌లో కెప్టెన్ శ్రీనివాస్‌కు కిట్‌ను అందజేశారు.

రాజీ లేకుండా అవకాశాలు అందిపుచ్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పద్మజా శ్రీరామ్

బాలాజీచెరువు: ఉన్నత స్థాయికి ఎదిగేందుకు రాజీ లేకుండా, సరైన పద్ధతిలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఏటీఅండ్‌టీ ఆసియా ఫసిఫిక్ రీజనల్ హెడ్ పద్మజా శ్రీరామ్ అన్నారు. జేఎన్‌టీయూకేలో ఐఐపీటీ డైరెక్టరేట్, అమెరికన్ టెలిఫోన్ టెలిగ్రాఫ్ కంపెనీలు సంయుక్తంగా బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు ఇండస్ట్రీ ఇంటరాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ పద్మజా శ్రీరామ్ మాట్లాడుతూ, ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ టెలిఫోన్ సేవలకు అమెరికాలో ఏటీటీ కంపెనీ పేరుగాంచడంతో పాటు, ప్రపంచంలో మూడో అతిపెద్ద టెలీకమ్యూనికేషన్స్ కంపెనీ అన్నారు. పెద్దగా ఆలోచించడంతో పాటు, ఏ పనైనా సమానంగా భావించి చేసినప్పుడే విజేతగా నిలుస్తారన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలతో వీలైనంత మందిని కలుపుకొనేందుకు అవకాశాలు సృష్టించుకోవాలన్నారు. ఏటీ అండ్ టీ సీనియర్ స్పెషలిస్ట్ గోపీనాథ్ మాట్లాడుతూ, విద్యార్థులు సాఫ్ట్‌స్కిల్స్‌తో పాటు, కమ్యూనికేషన్స్ స్కిల్స్, భావ వ్యక్తీకరణ అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం సాంకేతిక రంగంలో ప్రపంచంలో అనేక ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకునేందుకు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం వీసీ మురళీకృష్ణను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు.